పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కిస్మత్‌పూర్ బాబమ్మ కాలనీలో స్వచ్ఛదనం-పచ్చదనంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లోని బాబమ్మ కాలనీలో వాటర్ క్లోరినేషన్ టెస్ట్ చేసి టాబ్లెట్లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగస్వాములు కావాలన్నారు. తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శరత్‌చంద్ర, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, నిఖిల సంగారెడ్డి, మహేందర్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే కాలుష్య నియంత్రణ



ఎర్రకుంటలో గ్రీన్ యాత్ర ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: మొక్కల పెంపకంతోనే కాలుష్య నియంత్రణ సాధ్యమని, అందుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎర్రకుంటలో గ్రీన్ యాత్ర ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్లాంటేషన్‌ను సంస్థ ప్రతినిధి బషీర్‌తో కలిసి సందర్శించారు. పట్టణాలు, నగరాల్లో సీఎస్‌ఆర్ నిధులతో పట్టణ కాలుష్యాన్ని నియంత్రించేందుకు మియావాకి పద్ధతిలో ప్లాంటేషన్ అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఈ సందర్భంగా వారు చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమంలో కమిషనర్ శరత్ చంద్ర, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు సురేష్‌గౌడ్, పాపయ్యయాదవ్, మలాకీ రత్నం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను కాపాడాలి



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్

రాజేంద్రనగర్: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో నాటిన ప్రతి మొక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ అన్నారు. మంగళవారం శివరాంపల్లిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా నాటుతున్న ప్రతి మొక్కను కాపాడాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు అధికారిని రాధారాణి, నాయకులు జీవన్ దాస్, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

మణికొండ: నార్సింగి ప్రభుత్వ పాఠశాలలో గత కొన్నేళ్లుగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కిరణ్, కుషాల్, లోకేష్, భారతి, కృష్ణారెడ్డిలతో పాటు అటెండర్ నర్సింహులు బదిలీ కావటంతో వారిని సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, ఉపాధ్యాయులకు బదిలీలు తప్పవని, విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మీరాలం ట్యాంకును పరిశీలిస్తున్న డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రవికుమార్

అత్తాపూర్: వర్షాలు, వరదల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు రాజేంద్రనగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కె. రవికుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీరాలం ట్యాంకు, జూపార్కు తదితర ప్రాంతాల్లో సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సూచించారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జలమండలి అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: సర్కిల్ పరిధిలో నీటి సరఫరా, డ్రైనేజీ సమస్యలపై ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి ప్రకాష్‌గౌడ్ అన్నారు. ఇటీవల జలమండలి డివిజనల్ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సాయి లక్ష్మి, డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ , మేనేజర్లు శ్రావ్య, సాజిద్ అలీ,వర్క్ ఇన్‌స్పెక్టర్ జావీద్,అక్తర్ తదితరులు మంగళవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఫిర్యాదు అందిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులకు సూచించారు.

మహాశయా మీ సేవలు మరువం...



పోలీస్ అకాడమీలో..



ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..



కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో..



జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో..

రాజేంద్రనగర్ జోన్ బృందం: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు రాజేంద్రనగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, కాలనీల్లో జయశంకర్ చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. తెలంగాణ సాధనకు ఆయన చేసిన కృషిని కొనియాడారు.

కాముని చెరువు.. శుద్ధి ఎప్పుడు?

- కాలుష్యకాసారంగా 53 ఎకరాల చెరువు
- తాజాగా ఎస్‌టీపీ కేటాయింపులోనూ లేని కాముని చెరువు



శంషాబాద్ పట్టణంలో మురుగునీటితో ఉన్న కాముని చెరువు

శంషాబాద్: శంషాబాద్ ప్రజలకు సాగునీరు.. తాగునీరు అందించిన నిజాం కాలం నాటి కాముని చెరువు మూడు దశాబ్దాలుగా మురుగునీటి చెరువుగానే మిగిలిపోయింది. ఎస్‌టీపీ (మురుగు నీటి శుద్ధి ప్లాంట్) ఏర్పాటుకు సంబంధించి గత ఆరేళ్లుగా చేస్తున్న ప్రతిపాదనలన్నీ బుట్టదాఖలు అవుతున్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలోని అనేక చెరువులకు ఎస్‌టీపీలను ఏర్పాటు చేశారు. తాజాగా రెండు రోజుల కిందట కూడా కేటాయించిన ఎస్‌టీపీల కేటాయింపులో కాముని చెరువు లేకపోవడంపై స్థానికులు నిట్టూరుస్తున్నారు.

మురుగు పరుగంతా సాగర్ వైపే..

పట్టణానికి ముఖద్వారంగా ఉన్న కాముని చెరువు మొత్తం 53 ఎకరాల్లో విస్తరించి ఉంది. శంషాబాద్ మున్సిపాలిటీలోని పాత గ్రామంలోని మురుగునీటి డ్రైన్లన్నింటిని కూడా ఇందులోనే కలిపేశారు.వీటితో పాటు ఎగువ ప్రాంతం గుండా వచ్చే వర్షపునీరంతా కూడా ఇందులోనే చేరుతుంది. చెరువు నుంచి కిందికి ప్రవహించే నీరు జాతీయరహదారి కింది నుంచి దోసికుంట అక్కడి నుంచి సిద్దులగుట్ట పక్క నుంచి కొత్వాల్‌గూడ నుంచి నేరుగా హిమాయత్‌సాగర్‌లోనే కలుస్తున్నాయి. సాగర్‌నీరు కలుషితంలో శంషాబాద్ కాముని చెరువు కూడా భాగంగా మారుతోంది.

పట్టింపు లేదు..

కాముని చెరువులోకి మరో రెండు డ్రైన్లు ప్రతిపాదించిన అధికారులు చెరువు వద్ద మురుగునీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదించారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఒత్తిడి లేకపోవడంతో ఎస్‌టీపీ ఏర్పాటుపై ఉలుకుపలుకు లేకుండా పోతోంది. పటణం నడిబొడ్డున ఉన్న చెరువు కంపుకొడుతున్నాపట్టించుకోకపోవడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుకు సమీపంలో ఎస్‌టీపీ ఏర్పాటుకు కావల్సినంత భూమిని కేటాయించే పరిస్థితులు లేకపోవడంతో అడుగు ముందుకు పడడంలేదన్న వాదనలున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో దృష్టి పెడితే కాముని చెరువుకు ఎస్‌టీపీ ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాల సుందరీకరణకు అవకాశముంటుంది.

కేటాయించలేదు..

కాముని చెరువు ఎస్‌టీపీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినా ఇంతవరకు కేటాయించలేదు. చెరువు సంబంధించి..ఏర్పాటుకు ఉన్న సాంకేతిక అడ్డంకులపై త్వరలోనే సమీప ప్రాంతాల్లో పర్యటించి మళ్లీ ప్రతిపాదనలు పంపిస్తాం. - బి. సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

హర్షద్ అలీకి ఎస్ఐగా పదోన్నతి



హర్షద్ అలీ

అత్తాపూర్: అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ హర్షద్ అలీకి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ నుంచి సోమవారం రిలీవ్ అయిన హర్షద్ అలీ మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం పనిచేసిన అనుభవం ఉన్నదన్నారు. ఉన్నతాధికారులు పోస్టింగ్ ఎక్కడ ఇచ్చినా తాను ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

'మనూ'లో పుస్తకావిష్కరణ

రాయదుర్గం: సూఫీ మతం చాలా ప్రాముఖ్యత కలిగి ఉందని మనూ వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళవారం 'మనూ' సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ ద్వారా ప్రచురించిన సర్వీసెస్ ఆఫ్ సూఫియా దక్కన్ ఇన్ ది ప్రమోషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనల్ హార్మోనీ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. భగవంతునితో సన్నిహితంగా ఉండటమే దాని లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



శ్రీలక్ష్మి దవాఖానాలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థుల భద్రతకు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు ప్రాధాన్యం ఇవ్వాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం కాటేదాన్‌లోని పయోనీర్ కాన్సెప్ట్ పాఠశాల బస్సు బోల్తా పడిన ఘటనలో గాయపడిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కార్పొరేటర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. విద్యార్థులు బస్సులో ఎక్కే వరకు డ్రైవర్ అందులోనే ఉంటే ప్రమాదం జరిగేది కాదన్నారు. అన్ని పాఠశాలల నిర్వాహకులు విద్యార్థుల భద్రతపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

స్టీల్ బ్రిడ్జి నిర్మాణం వేగవంతం చేయాలి



స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. మంగళవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీ నుంచి అత్తాపూర్ వరకు హెచ్‌ఆర్‌డీసీఎల్ ఆధ్వర్యంలో మూసీ నదిపై చేపట్టిన స్టీల్ బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ తాగునీటి సమస్య తీర్చేందుకు జలమండలి ఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ భగీరథ పైపులైన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తేవాలని వాటిని పరిష్కరించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ రామదాసు, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, నిఖిల సంగారెడ్డి, నాయకులు సురేష్‌గౌడ్, పాపయ్య యాదవ్, సుమన్‌గౌడ్, మలాకీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

జేఈ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి



హైదర్షాకోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేఈ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం



విద్యార్థికి టీకా వేస్తున్న వైద్యురాలు

బండ్లగూడ: ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న జేఈ వ్యాక్సిన్‌ను చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యరత్న అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మెదడు వాపు వ్యాధి నివారణకు జేఈ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదడు వాపు నివారణకు 9 నెలల శిశువు నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా జేఈ వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఆగస్టు 15 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కె.విమల, హెచ్‌ఈవో సల్మాన్‌రాజ్, శ్రీధర్, సూపర్‌వైజర్ టి.అమృత, సరస్వతీ, విజయలక్ష్మి, ఆశావర్కర్లు వై.అరుణ, ఎం.రమా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైదిరెడ్డి, మదన్‌కుమార్, కవిత తదితరులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్ పల్లిలో..

చిన్నారులకు మెదడు వాపు వ్యాధి రాకుండా (జేఈ)వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించుకోవాలని శివరాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వందన రాజన్ అన్నారు.మంగళవారం నేతాజీ నగర్ గురుకుల మైనారిటీ పాఠశాలలో 200 మంది విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ..తల్లిదండ్రులు 10 నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎం గౌరీ,ఏ ఎస్ఎం లక్ష్మి, ఆశావర్కర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం..పచ్చదనంలో భాగస్వాములు కావాలి

శంషాబాద్: స్వచ్ఛదనం..పచ్చదనం కార్యక్రమంలో పౌరులందరూ భాగస్వాములు కావాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలన్నారు. చెట్లు పెంచడంతో కాలుష్యం తగ్గించుకుని ఆరోగ్య ప్రమాణాలను మెరుగుపర్చుకోవచ్చన్నారు. అన్ని బస్తీల్లో మొక్కలు నాటడంతో పాటు వాటిని పరిరక్షించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పకప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్, కమిషనర్ సమన్ రావు, కౌన్సిలర్లు మేకల వెంకటేష్, అజయ్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో 'ఫొటో కాంటెస్ట్'

రాయదుర్గం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్, ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఫొటో కాంటెస్ట్-2024ను నిర్వహిస్తారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ ఫొటో కాంటెస్ట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పాల్గొనే వారికి ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తాము తీసిన ఫొటోలను సమర్పించాల్సి ఉంటుంది. ఈ పోటీలలో ముగ్గురు విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు, పాల్గొన్నవారందరికీ సర్టిఫికెట్లను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

ఇంకుడు గుంతలు తప్పనిసరి



మణికొండలో ఇంకుడుగుంత పనులను ప్రారంభించిన సీడీఎంఏ గౌతమ్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో 300గజాలకు పైన నిర్మించే అపార్ట్‌మెంట్‌లలో ఇంకుడు గుంతల ఏర్పాటును తప్పనిసరి చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావుతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా మణికొండ 13వ వార్డులోని మర్రిచెట్టు సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఇంకుడు గుంత నిర్మాణ పనులను ప్రారంభించారు. కొత్తగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించి ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని చెత్త డంపింగ్ యార్డు, వర్మికంపోస్టు ఎరువుల తయారీని పరిశీలించారు. గండిపేటలో నీటి సరఫరాలో క్లోరినేషన్ కలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీల పరిధిలో పారిశుద్ధ్యం, పచ్చదనాన్ని పెంపొందించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీలలో ఉన్న పార్కులను పరిరక్షించటంతో పాటు వాటిల్లో పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. మణికొండలో పార్కుల అభివృద్ధిని ఎందుకు పట్టించుకోవటం లేదని కమిషనర్, ఏఈ, టీపీవోలను ప్రశ్నించారు. ప్రతి పార్కును వెంటనే అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, దానిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాగునీటిలో ఎక్కడా లీకేజీలు లేకుండా నాణ్యమైన నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమాల్లో మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, కమీషనర్ డి. ప్రదీప్‌కుమార్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మెన్ జి.విజయ్‌బాబు, కమీషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పలు శాఖల అధికారులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



నార్సింగి డంపింగ్ యార్డులో మొక్కలు నాటుతున్న అధికారులు

క్రైం కార్నర్..

నాటుసారా ముడి పదార్థాలు స్వాధీనం

రాజేంద్రనగర్: మహారాష్ట్ర లాథూర్ ప్రాంతం నుంచి బెల్లం, పటికలను నగరానికి తరలించి విక్రయిస్తున్న వ్యక్తిని రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏ-టీమ్ సభ్యులు పట్టుకున్నారు. అతడి నుంచి 7,320 కిలోల బెల్లం, 40 కిలోల పటిక, రెండు లీటర్ల నాటుసారా, కారు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉప్పర్‌పల్లిలోని శంషాబాద్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కిషన్ వివరాలు వెల్లడించారు. బేగంబజార్‌కు చెందిన పరేజ్ బాటి, మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బాలకోటి, కార్వాన్‌కు చెందిన ఘన్‌శ్యామ్‌లు ముఠాగా ఏర్పడ్డారు. వీరు లాథూర్ ప్రాంతం నుంచి వివిధ మార్గాల ద్వారా పటిక, బెల్లాన్ని నగరానికి తరలించి హైదర్‌గూడలోని కేశవనగర్ ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి నాటుసారా కాసే వారికి సరఫరా చేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏ-టీమ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై రవి సిబ్బందితో సోమవారం రాత్రి అత్తాపూర్ ప్రాంతంలో నిఘా ఏర్పాటు చేశారు. నిందితులు ముగ్గురు 1400 కిలోల బెల్లం బస్తాలను తీసుకుని వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. బాలకోటి, ఘన్‌శ్యామ్ అక్కడినుంచి పారిపోగా పరేజ్ బాటిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా... డంప్ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు కేశవనగర్‌లోని ఇంట్లో దాచిన మొత్తం 7,320 కిలోల బెల్లం, 40 కిలోల పటిక, రెండు లీటర్ల నాటుసారా, కారును స్వాధీనం చేసుకుని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జీవన్ కిరణ్, ఇన్‌స్పెక్టర్ దేవేందర్, సిబ్బంది శ్రీశైలం, సుధాకర్, సాయి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని..

అత్తాపూర్: మందు తాగేందుకు తల్లి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి పీవీ నరసింహారావు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వేపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అత్తాపూర్ రామ్‌భాగ్ ప్రాంతానికి చెందిన అంబాదాస్ (40) తల్లి మంగళ బాయితో కలిసి ఉంటున్నాడు. చెడు వ్యసనాలకు బానిసైన అతను మంగళవారం మద్యం తాగేందుకు తల్లిని డబ్బులు అడిగాడు. డబ్బులు ఇచ్చేందుకు తల్లి నిరాకరించడంతో పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేపైకి ఎక్కిన అంబదాస్ 155 పిల్లర్ వద్ద కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడిని పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

రాజేంద్రనగర్: గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నించిన ఇద్దరు యువకులను రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు అదుపులోకి తీసుకుని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు కిలో గంజాయితో మంగళవారం నగరానికి చేరుకున్నారు. బండ్లగూడ జాగీర్, హిమాయత్ సాగర్ ప్రాంతంలోని లార్డ్స్ కళాశాల వద్ద గంజాయిని విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో రాజేంద్రనగర్ ఎస్వోటీ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు. వారి నుంచి కిలో గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.